
ప్రజాశక్తి

బుధవారం 3 డిసెంబర్ 2025

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





18న మేయర్‌పై అవిశ్వాసం

కలెక్టర్ ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు మేయర్ పొట్లూరి స్రవంతికి పదవీ కాలం నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకుంది. రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆమెపై టిడిపి నాయకత్వం అవిశ్వాస తీర్మాన నోటీసులు ఇటీవల జారీ చేసింది. కలెక్టర్ హిమాన్షు శుక్లా సెలవులో ఉండడంతో దీనిని ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. మంగళవారం విధుల్లోకి వచ్చాక కలెక్టర్ ఈనెల 18న మేయర్ స్రవంతిపై అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. నెల్లూరు నగరంలో మొత్తం 54 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వీరంతా 2021లో వైసిపి తరపున గెలిచారు. టిడిపి అధికారంలోకి రావడంతో ఇందులో 42 మంది టిడిపిలో చేరారు. వైసిపికి 11 మంది మద్దతు ఉంది. స్రవంతికి టిడిపి, వైసిపి రెండు పార్టీల మద్దతు లేదు. మేయర్ ఒక్కరు మాత్రమే మిగిలారు.



పి. స్రవంతి, మేయర్ నెల్లూరు కార్పొరేషన్

గంజాయి అంతం.. ప్రజల పంతం..!



బంద్ సందర్భంగా నగరంలో నిర్వహించిన భారీ నిరసన ర్యాలీ

ప్రజా గాయకులు, సిపిఎం నాయకులు కె.పెంచలయ్య హత్యకు నిరసనగా మంగళవారం జరిగిన బంద్ విజయవంతమైంది..నెల్లూరు నగరంతోపాటు, జిల్లా వ్యాపితంగా ప్రజాగ్రహం పెల్లుబికింది... వామపక్షపార్టీలు సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, సిపిఐ ఎంఎల్, సిపిఎంఎల్ న్యూడెమొక్రసీ, బిఎస్‌పి, ఇసికె, ఎంఆర్‌పిఎస్, ఆర్‌పిఐలతో పాటు దళిత సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు మద్దతుగా బంద్‌లో పాల్గొన్నారు..టిడిపి, వైసిపిలు బంద్‌కు సంఘీభావం ప్రకటించాయి..నెల్లూరు నగరంలో సిపిఎం కార్యకర్తలకు పోలీసులకు మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. నెల్లూరునగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులను అరెస్ట్ చేశారు. వెంటనే విడుదల చేశారు. వ్యాపారులు, విద్యాసంస్థలు, ప్రయివేటు బస్సులు, కొన్ని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయ సిబ్బంది బంద్‌లో పాల్గొన్నారు..నెల్లూరు నగరంలో నిర్వహించిన ర్యాలీలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు...బంద్ విజయవంతమైంది... నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కార్యాలయంలో పెంచలయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బంద్ విజయ వంతమై ందని ప్రజల ఆగ్రహం చూశారని ఇప్పటికై గంజాయి అరికట్టాలని వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు.



కెవిఆర్ వద్ద జనం లేక నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

-బంద్‌కు విశేష స్పందన
-పెంచలయ్య హత్యను ఖండించిన జనం
-భారీ వర్షాలను లెక్కచేయని వైనం
-నగరంలో ఉద్రిక్తత
-బంద్‌లో వామపక్షాలు, కాంగ్రెస్, ప్రజా సంఘాలు
-టిడిపి, వైసిపి సంఘీభావం



కందుకూరులో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

"ఖబడ్దార్...ఖబడ్దార్.. గంజాయి గూండాల్లారా...గంజాయి అంతం..సిపిఎం పంతం.., జోహార్ పెంచలయ్య... సాధిద్దాం... సాధిద్దాం.. పెంచలయ్య ఆశయాలను." అంటూ సింహపురి మారుమోగింది...ప్రజా నాయకులు, కళాకారులు పెంచలయ్య హత్యకు నిరసనగా నెల్లూరు జిల్లా విజయవంతమైంది.జోరువర్షంలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు, వామపక్షాలు, కాంగ్రెస్ రోడ్డు మీదకొచ్చాయి..జిల్లా వ్యాపితంగా ప్రజలు రోడ్డుపైకి వచ్చారు. ఉదయం నుంచే బంద్‌ను పర్యవేక్షించారు. గంజాయి గుండాలకు వ్యతిరేకంగా నినదించారు.. నెల్లూరు నగరంలోని వర్తక, వ్యాపారులు బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. షాపులు మూతవేశారు. ప్రయివేటు బస్సులు నిలుపుదల చేశారు. ఆర్‌టిసి వద్ద సిపిఎం నాయకులు నిరసన తెలిపారు. సుందరయ్య కాలనీ జాతీయ రహదారిపై సిపిఎం నేతలు ధర్నా నిర్వహించారు.కొద్ది సేపు వాహనాలు నిలిచిపోయాయి.. ఆత్మకూరు బస్టాండ్ నుంచి గాంధీబొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. వెంకటేశ్వరపురం, శెట్టిగుంటరోడ్డు, ఆత్మకూరు బస్టాండ్, అయ్యప్పగుడి, ఆర్‌టిసి, సుందరయ్యకాలనీ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ప్రజలు బంద్‌కు మద్దతుగా హాజరయ్యారు. గాంధీబొమ్మ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న సిపిఎం నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులను పోలీసులు అరెస్ట్ చేశారు.వెంటనే విడుదల చేశారు. దీంతో పోలీసుల వాహనాన్ని కార్యకర్తలు అడ్డుకున్నారు. మర్రిపాడు మండల కేంద్రంలో సిపిఎం నాయకలు, పోలీసుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. జిల్లా వ్యాపితంగా ప్రజలు బంద్‌కు మద్దతు ప్రకటించారు కందుకూరు, గుడ్లూరు, ఉలవపాడు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, వింజమూరు, దుత్తలూరు, ఎఎస్‌పేట, అనంతసాగరం, సంగం, విడవలూరు కొడవలూరు, బుచ్చి, కోవూరు, టిపి గూడూరు, ఇందుకూరుపేట, ముత్తుకూరు, పొదలకూరు, బిట్రగుంట, అల్లూరు, దగదర్తి ప్రధాన కేంద్రాల్లో బంద్ విజయవంతంగా సాగింది. బంద్‌కు వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. హత్యను తీవ్రంగా ఖండించారు. నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పెంచలయ్య చిత్రపటానికి పూల మాలవేసి నివాళి అర్పించారు. జిల్లా వ్యాపితంగా "దిత్వా" తుపాన్‌తో జిల్లా వ్యాపితంగా జోరు వర్షం కురుస్తున్నా లెక్క చేయకండా ఉద్యమకారులు బంద్‌లో పాల్గొన్నారు.

నెల్లూరు నగరంలో భారీ ర్యాలీ

పెంచలయ్య హత్యకు నిరసనగా నెల్లూరు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. . రాజకీయపార్టీతో పాటు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నగర వాసులను విశేషంగా ఆకర్షించింది. పెద్ద ఎత్తున నినదించారు. గాంధీబొమ్మ నుంచి ప్రారంభమైన ర్యాలీ విఆర్‌సి, మద్రాసు బస్టాండ్ మీదుగా ఆర్‌టిసి వరకు సాగింది. ప్రజలు గంజాయికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. కార్యక్ర మంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామన్న, ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి అరెగెల నాగేంద్ర సాయి, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ కె.రాంబాబు, బిఎస్‌పి నాయకులు జానకిరామ్, సిపిఐ(ఎంఎల్) నాయకులు యానాదయ్య, కొం డమ్మ, ఎస్‌యుసిఐ బసవరాజు, అమ్‌ఆద్మీ నాయకులు నాగేశ్వరరావు, బీమ్‌రామ్ భారత్‌పార్టీ వెంకటేశ్వర్లు, ఆర్‌పిఐ నాయకులు మాబు,తోపాటు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం. మోహన్‌రావు, కె.అజయ్‌కుమార్ తోపాటు ప్రజా సంఘాలు సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులును అరెస్ట్ చేస్తున్న పోలీసులు



గాంధీ బొమ్మ వద్ద మానవహారం చేపట్టిన దృశ్యం

గంజాయిపై ఉక్కు పాదం మోపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్



మీడియాతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ప్రజాశక్తి-డెస్క్ :రాష్ట్రంలో గంజాయి లేకుండా ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. గంజాయి లేకుండా మేం చేస్తామన్నటువంటి హోంమంత్రి ప్రకటన మనం చూశాం కానీ ఒరిస్సా నుంచి రాష్ట్రంలో అనేక జిల్లాలకు రవాణా జరుగుతుందన్నారు. నెల్లూరు జిల్లాను చూస్తే అనేక చోట్ల ఈ గంజాయి మాదకద్రవ్యాలు వ్యాపారం జరుగుతుందన్నారు. పోలీసులు వాటిపై చర్యలు తీసుకోవడంలో వెనుకబడ్డారన్నారు. పెంచలయ్య నివసిస్తున్న కాలనీలో గంజాయికి వ్యతిరేకంగా యువతను ప్రోత్సహించాడు అలాంటి వ్యక్తిని గంజాయి మాఫియా అతి కిరాతకంగా హత్య చేశారన్నారు. పోలీస్ ఈ గంజాయి మాఫియాను ఉక్కు పాదం మోపి అంతమొందించాలని కోరారు.



బంద్ సందర్భంగా ట్రంక్ రోడ్డులో మూతపడ్డ దుకాణాలు

నగరంలో ఉద్రిక్తత..


నెల్లూరు : నెల్లూరులో పెంచలయ్య హత్యను నిరసిస్తూ జరిగిన బంద్‌లో ఉద్రిక్తత నెలకొంది. స్థానిక గాంధీ బొమ్మ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు గంజాయి మహమ్మారి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆ సమయంలో సిఐ కోటేశ్వరరావు అడ్డుకున్నారు. దీంతో సిపిఎం నాయకులకు, సిఐ,పోలీసులకు కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. దీంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొ న్నాయి. సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీని వాసులును బల వంతంగా పోలీసులు అరెస్టు చేసి జీపులో కుక్కారు. పోలీసుల చర్యలను వా మపక్షాల నేతలు కార్యకర్తలు తీవ్రంగా ప్రతిఘ టిం చారు.జీపుకు అడ్డంపడి నిరసన తెలిపారు.



పోలీసులతో వాగ్వివాదానికి దిగిన సిపిఎం నాయకులు

'మెడికవర్'లో ఆధునిక శస్త్ర చికిత్సలు

ప్రజాశక్తి-నెల్లూరు :"ప్లాస్టిక్ అండ్ ఏస్తెటిక్ సర్జరీలో విప్లవాత్మక మార్పులు అందుబాటులోకి వచ్చాయని మెడికవర్ వైద్యశాలలో అందుబాటులో ఉన్నట్లు ఆ వైద్యశాల డాక్టర్ ఎవి రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 21వ శతాబ్దం ప్రారంభం నుంచి ఈ రంగంలో విశేష పురోగతి సాధించబడిందన్నారు. జన్యుపరమైన లోపాలు, శరీర అభివద్ధిలో వచ్చే అసమానతలు, వయస్సుతో సంభవించే మార్పులను సరిచేయడంలో ఆధునిక ప్లాస్టిక్ సర్జరీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. సిలికాన్, టైటానియం, పాలిథిలీన్ వంటి పదార్థాలతో తయారు చేసిన అల్లోప్లాస్టిక్ ఇంప్లాంట్లు ముఖ నిర్మాణ సవరణ, ముక్కు ఆకృతి మార్పు, మొహం-దవడ ఎముకల సరిచేయడం, వంటి ఆధునిక సర్జిలు 'మెడికవర్'లో అందుబాటులో ఉన్నాయన్నారు.



డాక్టర్ ఎవి రెడ్డి

'ఇంటూరి'కి అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లా నుంచి తిరిగి ప్రకాశంలో కలిపేలా కృషి చేసిన ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావుకు కందుకూరు ఎంఇఒలు ఎం. నాగకుమార శర్మ, కె. సుబ్బారెడ్డి అభినందనలు తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎను వారు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.



ఎంఎల్ఎ ఇంటూరిని అభినందిస్తున్న దృశ్యం

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-కందుకూరు :మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ మండలంలోని జి మేకపాడు గ్రామ పంచాయతీలో మంగళవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పార్టీ గ్రామ కమిటీల గురించి చర్చించారు. కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు ఈదర రమేష్ బాబు, జీ మేకపాడు మాజీ సర్పంచ్ మరియు సీనియర్ నాయకులు బుస్సిరెడ్డి నాగేశ్వర రెడ్డి, మండల రైతు విభాగ అధ్యక్షులు గోగినేని రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఇంద్రాణి బాధ్యతలు స్వీకరణ

కందుకూరు కందుకూరు ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ సూపరి ంటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఇంద్రాణి గత వారంలో కందుకూరు ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి నూతన మెడికల్ సూపరింటెండ్‌గా ఇంద్రాణి నియమి తులయ్యారు. మంగళవారం ఉదయం బాధ్యతలు స్వీకరిం చారు. ఆమె మాట్లాడుతూ ఆస్పత్రి అభివద్ధికి కషి చేస్తానని తెలిపారు. రోగు లకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పారు.

బంద్‌కు విశేష స్పందన

పెంచలయ్య హత్యను ఖండిస్తూ వెల్లువెత్తిన నిరసనలు



ఉలవపాడులో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి -గుడ్లూరు :పెంచలయ్య హత్యను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో గుడ్లూరులో మంగళవారం బంద్ నిర్వహించారు. సిపిఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ జి వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్రయివేటు విద్యా సంస్థలు, కెనరా బ్యాంకు,వివిధ ప్రభుత్వ కార్యాలయాలను మూసివేయించారు. బస్టాండ్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఆర్టీసీ బస్సులను ఆపివేసి రాస్తారోకో నిర్వహించారు కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శులు కొట్టే వెంకయ్య గుత్తి మల్లికార్జున ఇరువురి బ్రహ్మయ్య రామ కష్ణయ్య ఎం వెంకటేశ్వర్లు కొమరగిరి అంజయ్య నేలటూరి తిరుపాలు పొట్లూరు రామచంద్రయ్య ఆర్ మాల్యాద్రి బీరకాయల వెంకటేశ్వర్లు సబలం చెన్నయ్య డివైఎఫ్ఐ కార్యదర్శి దాసరి సీతారాం డి బాలకోటయ్య రైతు సంఘం నాయకులు రామాల శ్రీనివాసులు 5వ నాయకురాలు కే కళ్యాణి ఎం లావణ్య ఎం రమణయ్య కందుకూరి కోటేశ్వరమ్మ కొమరగిరి లక్ష్మీకాంతమ్మ పొట్లూరి కోటమ్మ పావని వ్యవసాయ కార్మిక సంఘం నేత మెట్ట సుల సుభాన్ ఏడుకొండలు చేవూరి రాజగోపాల్ పాల్గొన్నారు.

ఉలవపాడు : గంజాయి మాఫియా చేతిలో అసువులు బాసిన పెంచలయ్య హత్యను నిరసిస్తూ మంగళవారం ఉలవపాడు అంబేద్కర్ బొమ్మ సెంటర్‌లో నిరసన జరిగింది. సిపిఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్ అధ్యక్షత వహించారు. సిపిఎం, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ, సీపీఐ, వైయస్సార్సీపి, బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడారు. పెంచలయ్య హత్యను ఖండించారు. సిపిఎం ప్రాంతీయ కమిటీ నాయకులు కత్తి. సుజాత, వైసిపి మండల అధ్యక్షులు నన్నం పోతురాజు, 99 బీసీ కులాల ఐక్యవేదిక చైర్మన్ శ్రీనువాసులు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీజిల్లా నాయకులు ఆర్. మోహన్, సిపిఐ నాయకులు దాసరి వెంకటరావు తదితరులు మాట్లాడారు. సిపిఎం నాయకులు కొమరగిరి వెంకటేశ్వర్లు, పొట్లూరి రవి, జి ప్రసన్నకుమార్, జి శివకుమార్, ఎం అంకమ్మరావు, కత్తి అనిల్, వీసం. సురేంద్ర, దనమ్మ, శిరీష ఉన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు :సిపిఎం నాయకులు పెంచలయ్య హత్యను నిరసిస్తూకందుకూరులో వామపక్షాలు మంగళవారం నిరసన చేపట్టారు. సిపిఎం కార్యాలయం వద్ద నుండి ప్రదర్శన చేపట్టారు. పోస్ట్ ఆఫీస్ సెంటర్లో రాస్తారోకో చేశారు.అంబేద్కర్ బొమ్మ వద్ద మానవహారం చేపట్టారు. సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్ఎ గౌస్,సిపిఎం నాయకులు నాదెండ్ల కోటేశ్వరరావు టి వెంకట్రావు ఐద్వా జిల్లా నాయకులు ఎస్.కె మున్వర్ సుల్తానా ,ఐద్వా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె మల్లిగా, ఎం పద్మ ,సిఐటియు నాయకులు డిఎం రాయుడు, ఎస్కే అస్మా ,ఎద్దు కొండమ్మ, ఒడ్డేముక్కల రమణమ్మ, సిపిఐ నాయకులు బి సురేష్ ,ఏఐటీయూసీ నాయకులు వై ఆనంద్ మోహన్ ,కాకుమాను రమణమ్మ ,నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నెల్లూరు :ప్రజానాట్యమండలి కళాకారుడు, సిపిఎం సభ్యుడు కె.పెంచలయ్య హత్యను నిరసిస్తూ మంగళవారం సుందరయ్య కాలనీ సిపిఎం శాఖ ఆధ్వర్యంలో జాతీయరహదారిపై ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిపిఎం నాయకులు కె.పెంచలనర్సయ్య, పాటల శ్రీనివాసులు, ఆటో యూనియన్ నాయకులు సురేష్, మహిళా నాయకులు రెహానాబేగం, ఎస్కె షాహినా బేగం నేతృత్వం వహించారు.



గుడ్లూరులో నిరసన తెలుపుతున్న దృశ్యం



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న ఉద్యమకారులు

భవనాలను క్రమబద్ధీకరించుకోవాలి

ప్రజాశక్తి-కందుకూరు

ఎపి ప్రభుత్వ పురపరిపాలనశాఖ వారు జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి భవన నియమాలను ఉల్లంఘించి నిర్మించిన భవనాలు,అనధికార భవనాలను రెగ్యులర్ చేసేందుకు బిపిఎస్ పథకాన్ని తీసుకొచ్చినట్లు మన్సిపల్ కమిషనర్ కె అనూష తెలిపారు. బిపిఎస్ పథకం ద్వారా ఈ ఏడాది ఆగస్టు 31కి ముందు నిర్మించిన అన్ని అనధికార భవనాలను రెగ్యులర్ చేసేందుకు అనుమతి వర్తిస్తుందన్నారు. నేటి నుంచి "120" రోజులు పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని తమ భవనాలను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి- లింగసముద్రం

మండలంలోని మొగిలిచర్లలోని దత్తాత్రేయ స్వామివారి హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. భక్తులు నుంచి 14,85,251 అన్నదానం హుండీ ద్వారారూ. 4,60,262 రూ పాయలు వచ్చినట్లు ఆలయ ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ తెలిపారు. రెండు హుండీల ద్వారా 19,45513 రూపాయలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ కందుకూరు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షించారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-కావలి



నినాదాలు చేస్తున్న నాయకులు

గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల నుండి విద్యార్థులను, యువకులను కాపాడాలని జిల్లా బంద్‌లో భాగంగా బందులో మంగళవారం కావలి పట్టణంలో అన్ని స్కూళ్లో, కాలేజీల్లో తిరిగి, బంద్ నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు సునీల్ మాట్లాడుతూ గంజాయి డ్రగ్స్ వ్యతిరేకంగా పోరాడినందుకు నెల్లూరులో సిపిఎం నేత పెంచలయ్యను చంపడం దుర్మార్గం నెల్లూరులో డ్రగ్స్ మూలాలను అరికట్టాలన్నారు. అవసరమైతే పెంచలయ్యను చంపిన వ్యక్తులను ఎన్‌కౌంటర్ చేయాలని జిల్లావ్యాప్తంగా డ్రగ్స్ గంజాయి మూలాలను అరికట్టేందుకు పోలీసు నిఘావ్యవస్థ ఏర్పాటు చేసి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా సభ్యులు ఖాదర్, మస్తాన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : పేదల ఆరోగ్య భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ భరోసాగా నిలుస్తుందని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం ఆత్మకూరు ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో 28 కుటుంబాలకు రూ.35.21 లక్షల విలువైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత కుటుంబసభ్యులకు మంత్రి ఆనం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో మన రాష్ట్రంలో, ఇతర రాష్ట్రాల్లోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య చికిత్సలు పొందిన కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా సిఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఒక్కొక్క కుటుంబానికి లక్షలాదిరూపాయలు ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉదారంగా మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఒక్క ఆత్మకూరు నియోజకవర్గంలో తమ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు 565మందికి రూ.5.72కోట్లు మంజూరు చేసి ఆ కుటుంబాలకు అండగా నిలిచినట్లు తెలిపారు. పేదల సంక్షేమంతో పాటు ఆరోగ్య భద్రతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మంత్రి పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్‌డిఒ పావని, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, కమిషనర్ గంగా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలోని వివిధ పంచాయతీల్లో వైసిపి మండల కన్వీనర్ కొండా రాజగోపాల్ రెడ్డి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోని గ్రామ గ్రామాన కూటమి ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని కోటి సంతకాల సేకరణలో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత అర్థమవుతుందన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకపాటి రాజగోపాల్ రెడ్డి సూచనలతో మండల పరిధిలోని వెంగళరావు నగర్, దంపవారి పల్లి, అప్ప సముద్రం, మాసాయిపేట ఎస్ సి కాలనీ వెంకట్రావుపల్లి, దుర్గం పల్లి తదితర పంచాయతీలోని గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ విస్తృతంగా చేపట్టామన్నారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ అక్కి భాస్కర్ రెడ్డి, సర్పంచ్ ఎం.తిరుపతి, మాజీ సర్పంచులు అబ్దుల్, ఎస్‌సిసెల్ అధ్యక్షులు ఉస్సే మండల గురవయ్య, రియాజ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

గంజాయి అమ్మే దంపతులు అరెస్ట్..

ప్రజాశక్తి-కొడవలూరు రూరల్ : గంజాయి అమ్మే దంపతులను కొడవలూరు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సిఐ సురేంద్ర రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు డైకస్ రోడ్డులో నివాసం ఉండే చిన్నరాజా – లక్ష్మి దంపతులు సోమవారం కొడవలూరు మండలం శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని ఫ్లైఓవర్ వంతెన వద్ద అనుమానంగా తిరుగుతున్న సమయంలో నెల్లూరు సిసిఎస్ సిఐ అశోక్‌కుమార్ నేతృత్వంలో వారిని అదుపులోకి తీసుకొని విచారించడంతో 7కేజీల గంజాయి లభించినట్లు ఆయన వివరించారు. ఒడిస్సా నుంచి గంజాయి దిగుమతి అవుతున్నట్లు తమ విచారణలో తెలిసిందన్నారు. ఈ మేరకు నిందితులైన దంపతులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కొడవలూరు ఎస్ఐ కోటిరెడ్డి, విడవలూరు ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.

వెహికల్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి-సంగం : సంగంలోని ప్రయివేట్ పాఠశాలలకు చెందిన స్కూల్ వ్యాన్లను విద్యార్థుల భద్రతకు దృష్టిలో ఉంచుకొని మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ రాములు సమగ్రంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో ముఖ్యంగా వ్యాన్ల ఫిట్‌నెస్, భద్రతా నిబంధనల అమలుపై దృష్టి సారించారు. ప్రతి వ్యానును క్షుణ్ణంగా పరిశీలించి, వాటి భద్రతా ప్రమాణాలను తనిఖీ చేశారు. వ్యాన్ల బ్రేక్స్, టైర్లు, ఇంజన్ పనితీరు, లైట్లు వంటి ముఖ్యమైన భాగాలను పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించడానికి వీలుగా వ్యాన్లలో పనిచేసే ఫైర్ ఎగ్జిట్ అందుబాటులో ఉందా... లేదా.. అని తనిఖీ చేశారు. ప్రమాద సమయాల్లో విద్యార్థులు సురక్షితంగా బయటకు వెళ్లడానికి ఉపయోగపడే అత్యవసర ద్వారం సక్రమంగా పనిచేస్తుందో లేదో నిర్ధారించుకున్నారు. చిన్నపాటి గాయాలకు చికిత్స అందించడానికి అవసరమైన మందులు, పరికరాలు ఉన్న ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను పరిశీలించారు. విద్యార్థుల భద్రత విషయంలో రాజీ పడకూడదని పాఠశాల యాజమాన్యాలకు, డ్రైవర్లకు గట్టిగా సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే లేదా ఫిట్‌నెస్ లేని వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి పాఠశాల కూడా భద్రతా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని తెలియజేశారు.

దుప్పట్లు పంపిణీ



ప్రజాశక్తి-కావలి : ప్రియదర్శిని మహిళా మండలి ఆధ్వర్యంలో తోట రేవంత్ కుమార్, తేజస్విని కుమారుడు తోట వెంకట శివ ధరణిష్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం పెంకులపాళ్యంలో నివసించే వృద్ధులకు దుప్పట్లు, భోజనం, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షురాలు ఖాదర్ బీ, సెక్రటరీ (రామస్వామి) భాషా, గుడ్‌మెన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సోమిరెడ్డి బ్రహ్మయ్య, సచివాలయం ఉద్యోగి వినోద్, స్కూలు హెడ్మాస్టర్, పాండు ఆర్.పి.కామాక్షి, ప్రియదర్శిని మహిళా మండలి వాలంటీర్ విజయకుమార్, స్వప్న, తోట వెంకటశివ ధరణిష్ కుటుంబ సభ్యులు, కాలనీ వృద్ధులు పిల్లలు పాల్గొన్నారు.

వెంగళరావు నగర్‌లో 'విపిఆర్ నేత్ర'



ప్రజాశక్తి-ఉదయగిరి : నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విపిఆర్ నేత్ర ఐస్ట్ శిబిరంలో అందిస్తున్న ఉచిత వైద్య సేవలపై ప్రజలు ఎంతో ఆసక్తి చూపిస్తున్నారని గ్రామ కమిటీ అధ్యక్షులు యువనాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విపిఆర్ ఉచిత నేత్ర సేవలపై ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని మండలంలోని గండిపాళెంలో మొదటి రోజు 2188 వైద్య పరీక్షలు నిర్వహించగా రెండవ రోజు వెంగళరావు నగర్లో ప్రారంభించిన ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. ముందుగా వరికుంటపాడు మండలంలో 5700 మందిని పరీక్షించగా అందులో 3500 మందికి కంటి అద్దాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని పంచాయతీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో యువ నాయకులు బి.వివేక్ నాయక్, షేక్ కాలేషా, షేక్ హరీష్, అక్బర్, సుబ్బరామయ్య, ఆరిఫ్, జె.ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కడనూతల గ్రామంలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ కాలుష్య నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సివిల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.వి.ఎస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్ఎస్ఆర్ ఎంబిఎ డిపార్ట్మెంట్ సీనియర్ అధ్యాపకులైన బి.శ్రీకాంత్ రెడ్డి పాల్గొని జాతీయ కాలుష్య నివారణ చర్యల గురించి బిటెక్ విద్యార్థిని, విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆరవి రమణారెడ్డి, వై వ్యస ఎస్ అధ్యక్షులు డాక్టర్ బి.సత్యనారాయణ రెడ్డి, సివిల్ డిపార్ట్మెంట్ అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం

సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన బంద్ విజయవంతమైంది. గంజాయి మూకల దాడిలో హత్యకు గురైన సిపిఎం సభ్యుడు, ప్రజానాట్య మండలి కళాకారుడికి నివాళులర్పిస్తూ సిపిఎం నేతృత్వంలో వామపక్షాలు, కాంగ్రెస్, బిఎస్‌పి, తదితర ప్రజా సంఘాలు మంగళవారం బంద్ నిర్వహించారు. పలుచోట్ల పోలీసులకు నాయకులకు వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. అయినప్పటికీ విద్యార్థులు, వ్యాపార దుకాణాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని గంజాయి, డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో భాగమయ్యారు..



నెల్లూరు రూరల్‌లో..

ప్రజాశక్తి-నెల్లూరురూరల్ : సిపిఎం నాయకులు ప్రజానాట్య మండలి కళాకారుడు పెంచలయ్యను గంజాయి, డ్రగ్స్ మాఫియా హత్య చేయడాన్ని నిరసిస్తూ సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో పొట్టేపాలెం గ్రామం ప్రధాన రహదారిపై వాహనాలను ఆపి బంద్ నిర్వహించారు. బంద్‌లో పాల్గొన్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరి తిరుపాలు, మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధన్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పొట్టేపాలెం చంద్రమౌళి, మండల కమిటీ సభ్యులు ముత్యాల నాగయ్య, ఎడవల్లి రమణయ్య, జానా లక్ష్మీ ప్రసాద్, పాదర్తి మస్తానయ్య, పర్చూరు ప్రభాకర్, అచ్చి అనంతయ్య, పేరత్తూరు నాగరాజు, కామాక్షయ్య, బద్దిపూడి వెంకటసుబ్బయ్య, పాదర్తి నారాయణ, పాదర్తి మస్తాన్, విరువూరు వెంకట రమణయ్య, పి.మనోహర్, ఎస్కే అమీర్ బాషా పాల్గొన్నారు.



కోవూరులో..

ప్రజాశక్తి-కోవూరు : ప్రజానాట్య మండలి కళాకారుడు, కార్యదర్శి పెంచలయ్యను గంజాయి మాఫియా దారుణంగా హత్య చేసిన సంఘటన పై వామపక్ష పార్టీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కోవూరు పట్టణంలో బంద్‌ను నిర్వహించాయి. బంద్‌కు వ్యాపారవేత్తలు, దుకాణదారులు స్వచ్ఛందంగా మద్దతు తెలుపగా పట్టణంలోని కోవూరు బజారు సెంటర్‌లో వామపక్ష నేతలు, కార్యకర్తలు బైటాయించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం నేత గండవరపు శేషయ్య, మండల కార్యదర్శి గండవరపు బుజ్జయ్య, బట్ట పెద్ద భయ్యా, ఎస్కే బాబు, ఎస్కే అఫ్రోజ్, ఎస్.కె చాన్ బాష, యువి రమణయ్య,ఎస్.కె కాలేషా, రమేష్, సురేంద్ర సిపిఐ నాయకులు నంది పోగు రమణయ్య, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ముత్తుకూరులో..

ప్రజాశక్తి-ముత్తుకూరు : భావి తరాలకు నెల్లూరు జిల్లా గంజాయి రహిత జిల్లాగా ఉండాలని ఆ దిశగా సిపిఎం కృషి చేస్తుందని జిల్లా కమిటీ సభ్యులు గడ్డం అంకయ్య అన్నారు. సిపిఎం యువ నాయకులు, ప్రజానాట్య మండలి కళాకారుడైన కె పెంచలయ్యను గంజాయి ముఠా హత్య చేయడం నిరసిస్తూ రాష్ట్ర పార్టీ బంద్‌కు పిలుపుగా మంగళవారం స్థానిక సిపిఎం నాయకత్వం పలు ప్రాంతాల్లో బంద్ నిర్వహించింది. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నక్కా రాధయ్య, మండల కమిటీ సభ్యులు షేక్ మస్తాన్ షా, పట్టపు జయ రామయ్య, కల్లూరి నాగరాజు, మహిళా సంఘం మండల కార్యదర్శి మన్నే పద్మమ్మ, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, సిఐటియు

మండల కన్వీనర్ గోడ భాస్కర్, కార్యకర్తలు పాల్గొని బంద్‌ను విజయవంతం చేయించారు.



విడవలూరులో..

ప్రజాశక్తి-విడవలూరు : మండల కేంద్రంలో గంజాయి మాఫియా గంజాయి డ్రగ్స్ ముఠాకు వ్యతిరేకం గా సాగే పోరాటంలో అత్యంత కిరాతకంగా ప్రజా కళాకారుడు పెంచలయ్యను హత్య చేయడాన్ని నిరసిస్తూ బంద్ విజయవంతంగా జరిగింది. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తుళ్లూరు గోపాల్, మండల కార్యదర్శి, నాయకులు పాల్గొన్నారు.



బుచ్చిలో..

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : నెల్లూరు కల్లూరు పల్లిలో పెంచలయ్య హత్యకు కారణమైన గంజాయి గుండాలను కఠినంగా శిక్షించాలని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం బుచ్చిరెడ్డిపాళెం బస్టాండ్‌లో బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు, సిపిఎం మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, సిఐటియు మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జునరావు, పట్టణ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసులు, రైతు సంఘం కార్యదర్శి పుత్తేటి మల్లికార్జున, తాటిబోయిన నారా యణ, కార్యదర్శి తంబి రమణయ్య, గరికపాటి సురేష్, మద్ది శెట్టి సురేష్, నన్నం మాధవయ్య, షేక్ ఖాదర్ బాషా, దత్త శ్రీ కోటయ్య, క్రిష్ణ ప్రసాద్, మల్లికార్జున కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎఎస్‌పేటలో..

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : స్థానిక మండల కేంద్రంలో ప్రజానాట్యమండలి కళాకారుడు సిపిఎం నేత కె.పెంచలయ్య హత్యకు నిరసనగా సిపిఎం తలపెట్టిన బంద్, పోలీసు వారు అడగడుగునా అడ్డగించడంతో, పెంచలయ్య అమర్ రహే అంటూ నినాదాలతో వెనుతిరగడం జరిగింది. ఈ నిరసనలో సిపిఎం కార్యకర్తలు, సిఐటియు నాయకులు గయాజ్ తదితరులు పాల్గొన్నారు.



టిపిగూడూరులో..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : ప్రజానాట్యమండలి నెల్లూరు రూరల్ కార్యదర్శి, సిపిఎం కార్యకర్త పెంచలయ్య హత్యను నిరసిస్తూ మండలం లోని నరుకూరు సెంటర్లో సిపిఎం, అనుబంధ సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం బంద్ ప్రశాంతంగా గ్రాండ్ సక్సెస్ అయింది. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, మారుబోయిన రాజా మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు బండి రాజయ్య, ప్రభావతమ్మ, చింతా రామసుబ్బయ్య, కందిపాటి రవణమ్మ, అజమ, గోపి, రైతులు, ఆటో, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్ : పెంచలయ్య



సిపిఐ ఆధ్వర్యంలో..

హత్యను నిరసిస్తూ నగరంలో మంగళవారం వామపక్షాల ఆధ్వర్యంలో బంద్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్సాఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అజీజ్, అహ్మద్ బాషా, షానవాజ్, షాజహాన్, లతీఫ్, షబ్బీర్, మున్వర్, అలీ, షాకీర్, చిన్న పాల్గొన్నారు.



ఆత్మకూరులో..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : నెల్లూరు నగరంలో డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా పోరాడుతూ అరాచక దాడికి బలైన కళాకారుడు సిపిఎం పార్టీ నాయకుడు పెంచలయ్యను హత్య చేసిన గంజాయి ముఠాను కఠినంగా శిక్షించాలంటూ మంగళ వారం ఆత్మకూరు పట్టణంలోని సిపిఎం నాయకులు, ప్రజాసంఘాల నాయకులు ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకే ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఆర్‌టిసి బస్సులు నిలిపివేసి బంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్‌రాజు, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మంగలి పుల్లయ్య, సిఐటియు జిల్లా నాయకులు జివి శివప్రసాద్, సిఐటియు మండల అధ్యక్షులు ఆత్మకూరు నాగయ్య, సిపిఎం సీనియర్ నాయకులు సంధాని, ఎం.నాగేంద్ర, వాగాల శ్రీహరి, ఆళ్ల హజరత్తయ్య, కృష్ణమోహన్, పలువురు సిపిఎం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేటలో..

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : డ్రగ్స్ మాఫియాను అరికట్టడంలో విఫలమైన ప్రభుత్వంపై సిపిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో ముందుండిన పెంచలయ్యను కిరాతకంగా హతమార్చిన ఘటనపై నిరసనగా ఇందుకూ రుపేట మండలంలో బంద్ నిర్వహించారు. సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన ఈ బంద్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షులు టివివి ప్రసాద్, సిపిఎం మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వర రావు, సిఐటియు గౌరవాధ్యక్షులు ఎస్.కె.చాన్ బాషా, రైతు సంఘం నాయకులు ప్రభాకర్ రెడ్డి, దయాసాగర్, తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరులో..

ప్రజాశక్తి-కొడవలూరు రూరల్ : సిపిఎం రూరల్ కార్యదర్శి పెంచలయ్యను అతి దారుణంగా హత్య చేసిన గంజాయి గుండాలను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా నాయకులు గోనె దయాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలం కార్యదర్శి షేక్ మాబాషా, సిఐటియు నాయకులు నర్సయ్య, దేవానంద, నాగమ్మ, ప్రసన్న, సురేష్ తదితరులున్నారు.

ప్రజాశక్తి-దగదర్తి : సిపిఎం కార్యకర్త, ప్రజానాట్యమండలి కళాకారుడు పెంచలయ్య ను గంజాయి ముఠాహత్య చేసిన ఘటనలో భాగంగా సిపిఎం, సిఐటియు, వామపక్షాలు,



దగదర్తిలో..

ప్రజాసంఘాలు, కాలేజీ విద్యార్థి, విద్యార్థుల తోటి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గోపసాని రమేష్, ఒంటేరు సుధాకర్, మంద మహేష్, పెరికల మాల్యాద్రి, చల్లా మాలాద్రి, గోపసాని మధు, బత్తల మధు, తదితరులు పాల్గొన్నారు.



మర్రిపాడులో..

ప్రజాశక్తి-మర్రిపాడు : సిపిఎం సభ్యుడు, ప్రజానాట్య మండలి కళాకారుడు పెంచలయ్య హత్యకు నిరసనగా సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు నెల్లూరు – ముంబై జాతీయ రహదారి బంద్ నిర్వహించారు. అనంతరం సాయంత్రం కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టి పెంచలయ్యకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలి వెంగయ్య, కార్యదర్శి రహంతుల్లా, సిఐటియు కార్యదర్శి రత్నయ్య, మండల వ్యవసాయ సంఘం ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఐద్వా నాయకురాలు శ్యామలమ్మ, ప్రమీల, సీనియర్ నాయకులు మహమ్మద్ గౌస్, సూర్యనారాయణ, పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరులో..

ప్రజాశక్తి-పొదలకూరు : గంజాయి ముఠా చేతిలో హత్యకు గురైన పెంచలయ్య సంఘటనను నిరసిస్తూ మంగళవారం వామపక్ష, ప్రజా సంఘాలు తలపెట్టిన జిల్లా బంద్‌లో పొదలకూరు బస్టాండ్ సర్కిల్‌లో సిపిఎం, విద్యార్థి, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లాడి గోపాల్, సిఐటియు మండల కార్యదర్శి పంచాయతీ శ్రీనివాసులు మాట్లాడారు.సిఐటియు మండల అధ్యక్షుడు గౌరీ, మహేంద్ర, వెంకటేశ్వర్లు, ఎస్‌సి ఎస్‌టి నాయకులు, పాండు రషీద్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మస్తాన్, అనిల్, మోక్ష, సాయి, తదితరులు పాల్గొన్నారు.



జలదంకిలో..

ప్రజాశక్తి-జలదంకి : మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా, సిపిఎం నాయకులు పెంచలయ్య హత్యకు నిరసనగా జలదంకిలో మంగళవారం సిపిఎం, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, మహిళా సంఘాలు తలపెట్టిన బంద్ విజయవంతం అయింది. స్థానిక సురే చెంచురెడ్డి భవన్ నుండి ప్రదర్శనతో కేయూ రోడ్డుపై బస్టాండ్ సెంటర్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. బంద్‌లో పాల్గొన్న వక్తలు తాళ్లూరు మాల్యాద్రి, రావి మాల్యాద్రి, గడ్డంమాల్యాద్రి, ఎం.ఆంథోని బాబు, మహిళా నాయకురాలు జి విజయలక్ష్మి, సిఐటియు నాయకులు ఎస్ అంకయ్య, కే మాధవ, బత్తుల నరసింహులు మాట్లాడారు.



బిట్రగుంటలో..

ప్రజాశక్తి-బిట్రగుంట : ప్రజానాట్య మండలి కళాకారుడు కె.పెంచలయ్యను హత్య చేసిన దోషులకు న్యాయస్థానాలు కఠినంగా శిక్షించాలని పెంచలయ్య మరణానికి నిరసనగా మంగళవారం బోగోలు సిపిఎం ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించి ధర్నా కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల సిపిఎం శాఖ సీనియర్ నాయకులు తుమ్మల వెంకయ్య, సిఐటియు అధ్యక్షులు చల్ల నరహరి, ఉపాధ్యక్షుడు ఎస్.కె.అన్వర్ బాషా, సిఐటియు కార్యదర్శి బాదుల్లా, కడనూతల శాఖ కార్యదర్శి పోట్లూరి శ్రీనివాసులు, విశ్వనాథరావుపేట శాఖ కార్యదర్శి ఎన్.రామయ్య, మండల సిపిఎం నాయకులు యానాదయ్య, అహ్మద్ భాషా, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు సీనయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మహీంద్రా, ఆటో యూనియన్ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



కావలిలో..

ప్రజాశక్తి-కావలి : ప్రజాకళాకారుడు, సిపిఎం నాయకులు కె.పెంచలయ్య హత్యకు నిరసనగా వామపక్ష పార్టీలు ప్రజా సంఘాలు ఇచ్చిన నెల్లూరు జిల్లా బంద్ పిలుపులో భాగంగా మంగళవారం విద్యాసంస్థలన్నీ మూత వేయించారు. కావలిలో ఏరియా ఆసుపత్రి వద్ద నుండి వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనగా బయలుదేరి, కోర్టు దగ్గర శివాజీ సెంటర్ మీదుగా తిరిగి ఆర్‌టిసి బస్టాండు సెంటర్ కు ప్రదర్శన చేసి రాస్తారోకో, మానహారం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, సిపిఐ నాయకులు కొప్పర్తి నాగరాజు, సిపిఐఎంఎల్ నాయకులు ఎల్.లక్ష్మారెడ్డి, ఎంఆర్‌పిఎస్ నాయకులు జి.వెంకటేశ్వర్లు, పిడిఎస్‌యు మాజీ నాయకులు కే.భాస్కర్ మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్ వెంకయ్య, పి.తిరుపాలు, వై.కృష్ణమోహన్, బి.కృష్ణయ్య, జి.మధుసూదన్ రావు, సిపిఐ నాయకులు పి బోస్, డి దర్గాబాబు, ఎంఆర్‌పిఎస్ నాయకులు చేవూరి కిరణ్, చేవూరి వరప్రసాద్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పి.వినీల్, ఎస్.కె.అహ్మద్, డివైఎఫ్‌ఐ నాయకులు కే.చెన్నయ్య, మహిళా సంఘం నాయకులు ఎం.శైలజ, ఎస్.కె.షబీర, షమీమా, పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు సునీల్, మస్తాన్, కార్యకర్తలున్నారు.



అల్లూరులో..

ప్రజాశక్తి-అల్లూరు : మండల సిపిఎం, సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజానాట్య మండలి నెల్లూరు రూరల్ కార్యదర్శి సిపిఎం కార్యకర్త పెంచలయ్య హత్యను నిరసిస్తూ అల్లూరు బసవరెడ్డి శంకరయ్య స్మారక భవనం నుండి ర్యాలీగా అంబేద్కర్ బొమ్మ వద్దకు చేరుకొని బంద్ నిర్వహించారు. పాటి భాస్కర్, టౌన్ కార్యదర్శి షైక్ రషీద్, మండల కమిటీ కార్యదర్శి గోపసాని రమేష్, నేతగాని రమణయ్య, సిఐటియు, ఆశావర్కర్ల జిల్లా ఉపాధ్యక్షురాలు కంచుబట్ల విజయలక్ష్మి, నేతగాని రమణయ్య, మాలపాటి వెంకయ్య, విద్యార్థులున్నారు.



ఉదయగిరిలో..

ప్రజాశక్తి - ఉదయగిరి : ఎంతవరకు ప్రజా గాయకుడు ఉద్యమకారుడు పెంచలయ్య కుటుంబాన్ని హోం మంత్రి పరామర్శించకపోవడం దారుణమని సిపిఎం సిఐటియు నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా మంగళవారం మత్తుమందు మారకద్రవ్యాలు ముఠాతో మరణించిన పెంచలయ్య హత్యకు నిరసనగా చేపట్టిన ధర్నా లో భాగంగా నిరసన ర్యాలీ చేపట్టారు. సిపిఎం రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, ఎంపిటిసి కాకు విజయ, మహిళా ఐద్వా నాయకురాలు కామాక్షమ్మ నాయకులు వెంకటేశ్వర్లు, నాయబ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-అనంతసాగరం : సిపిఎం సభ్యుడు పెంచలయ్య ను గంజాయి ముఠా చేసిన హత్యకు అనంత సాగరం బస్టాండ్ సెంటర్ లో సంతాపం తెలిపి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మంగళ పుల్లయ్య, మండల కార్యదర్శి అన్వర్‌బాషా మాట్లాడారు. బంద్‌కు అనంతసాగరం గ్రామ నాయకులు సడ్డ రవీందర్ రెడ్డి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు డాక్టర్ సుబ్బారాయుడు, వేము పెంచలయ్య, గాడి సుధాకర్, జక్రయ్య, నాగులూరు వెంకటేష్, సందాని, మస్తాన్, ఫక్రూసా, ఇమ్రాన్, వంశీ, పెంచలనరసింహులు పాల్గొన్నారు.

ఆత్మకూరు సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపాలిటీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర దేవాదాయశాఖ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని పలువార్డుల్లో మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి పర్యటించారు. పలు కాలనీల్లో స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని, పరిష్కరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు, డ్రెయినేజీలను పరిశీలించారు. వార్డు కౌన్సిలర్లు, స్థానిక నేతల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాలిటీలో జరగాల్సిన అభివృద్ధి చాలా ఉందని, ప్రణాళికాబద్ధంగా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అన్ని వార్డుల్లో డ్రెయినేజీ, రహదారుల వ్యవస్థ పటిష్టం కావాల్సి ఉందన్నారు. విస్తరించిన ఆత్మకూరు శివారు ప్రాంతాల్లో కనీసం రోడ్లు, డ్రెయిన్లు కూడా లేవన్నారు. ఆర్థిక వనరులను సమకూర్చు కుంటూ ఒక్కొక్కటిగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. డ్రెయినేజీల నిర్మాణానికి రూ.2కోట్లు, సిమెంటు రోడ్లు నిర్మాణానికి రూ.5.10కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు మొదలుపెట్టనున్నట్లు తెలిపారు. ఇది ఆరంభం మాత్రమేనని అన్నివార్డుల్లో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థల ఏర్పాటుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. మున్సిపల్ కార్యాలయం నుండి సోమశిల రోడ్డు



ఆత్మకూరు పట్టణంలో పర్యటిస్తున్న మంత్రి ఆనం

వరకు నాలుగులైన్ల రహదారి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 7 రహదారుల ఏర్పాటుకు రూ.27 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. అలాగే వీర్లగుడిపాడుకు రహదారి సౌకర్యం కల్పించి సంగం జాతీయ రహదారితో అనుసంధానం చేసేలా బీరాపేరు వాగుపై రూ.25 కోట్లు బ్రిడ్జి నిర్మాణం మంజూరైనట్లు తెలిపారు. త్వరలో ఈ పనులన్నీ కూడా ప్రారంభమవుతున్నా యని మంత్రి స్పష్టం చేశారు. ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం నివేదికలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పురపాలక శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ పావని, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, కమిషనర్ గంగాప్రసాద్, తహశీల్దార్ పద్మజాకుమారి, టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, ఇందూరు వెంకటరమణారెడ్డి, పిటికటి వెంకటేశ్వర్లు నాయుడు, కౌన్సిలర్లు సురా భాస్కర్ రెడ్డి, కొప్పోలు రమాదేవి, మహబూబ్ బాషా, శివ కోటారెడ్డి, మాదాల శ్రీనివాసులు నాయుడు, టిడిపి నాయకులు కొప్పోలు చిన్నపరెడ్డి, తదితరులున్నారు.



తహశీల్దారుకు సమస్యను వివరిస్తున్న గ్రామస్తులు

భూ ఆక్రమణకు యత్నం..

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని వెంకటాపురం గ్రామంలో కొందరు భూ ఆక్రమణలకు పాల్పడుతూ అసలు వారికి భూములు లేవని అంటున్నారని మంగళవారం గ్రామస్తులు స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి దూరంగా అటవీ ప్రాంతంలో ఉంటూ పెద్దలు పేరున ఉన్న కొద్ది భూమిలో పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు 6, 7 భూ పంపిణీలలో పేర్లు నమోదు చేసి 6వ విడతలో పట్టాలు మంజూరు చేశారు కానీ ఆడంగల్‌లో నమోదు చేయలేదన్నారు. గ్రామంలో సెంటు భూమి లేని నిరు పేదలున్నారని, వారు భూ ఆక్రమణకు పాల్పడుతున్నారని తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారే ఆక్రమణకు పాల్పడుతున్నారన్నారు. సర్వే నెంబర్ 392, 400, 401, 401, 405, 406, 407, 408, 409 గ్రామంలో ఉన్న పేదలు ఎవరూ ఆక్రమించలేదని, పెద్దలు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తహశీల్దార్‌కు వివరించారు. పరిశీలించి భూ పంపిణీలో పట్టాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు.

తలసేమియా బాధితులకు చేయూత

ప్రజాశక్తి-కావలి

తలసేమియా బాధిత చిన్నారులకు తమవంతు చేయూత అందిస్తామని పలువురు పేర్కొన్నారు. మంగళవారం రెడ్‌క్రాస్ తలసేమియా డే కేర్ సెంటర్‌ను కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ సహాయకులు ఒగ్గు సుజల్ కుమార్, గ్రీన్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు వేమూరు గాయత్రి, విశ్రాంత ఉపాధ్యాయులు సీతారామయ్య, మార్కండేయలు సందర్శించి, అక్కడ రక్తమార్పిడి చేయించుకుంటున్న తలసేమియా బాధిత చిన్నారులతో, వారి తల్లిదండ్రులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. నిర్వాహకులు వారి చేతులమీదుగా చిన్నారులకు మందులు, పౌష్టికాహారం, భోజనం పొట్లాలు అందజేశారు. ఈ సందర్భంగా ఒగ్గు సుజల్‌కుమార్ మాట్లాడుతూ తాను కొంతమంది చిన్నారులను దత్తత తీసుకుని వారికి ప్రతినెలా అయ్యేమందులు, పౌష్టికాహారం కోసం అయ్యే ఖర్చు భరిస్తానని ప్రకటించారు. విశ్రాంత ఉపాధ్యాయులు సీతారా మయ్య, మార్కండేయలు చిన్నారుల ఖర్చు నిమిత్తం తమ పెన్షన్ నుండి ప్రతినెలా కొంతమంది మొత్తం అంద జేస్తామని తెలుపగా, గ్రీన్ హ్యాండ్స్ అధ్యక్షురాలు



తలసేమియా బాధితులను పరామర్శిస్తున్న దృశ్యం

వేమూరి గాయత్రి తమ సంస్థ సభ్యుల నుండి ఆర్థిక సహకారంతో పాటు తలసే మియా బాధిత చిన్నారుల కోసం శిబిరాలు నిర్వహించి రక్తం సేకరిస్తానని హామీనిచ్చారు. వారిని రెడ్‌క్రాస్ బాధ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తలసేమియా ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పామూరు శ్రీధర్, కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, చైర్మన్ డి.రవిప్రకాష్, వైస్ చైర్మన్ కె.హరినారప రెడ్డి, పాలకమండలి సభ్యులు బెజవాడ ప్రసన్నకుమార్, జిల్లా పాలకమండలి సభ్యులు కె శ్రీహరిరెడ్డి, జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ గాదిరెడ్డి హరనాథ్, విశ్రాంత ఎంఇఒ కల్లయ్య, బోరెడ్డి రజని, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగులకు కౌశలం పరీక్షలు

ప్రజాశక్తి-వింజమూరు: నిరుద్యోగ యువతలో నైపుణ్యం పెంపు, ఉపాధి కల్పన కోసం కౌశలం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కౌశలం కార్యక్రమానికి సంబంధించి డిసెంబర్ 2వ తేదీ నుండి ఆరో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఒ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ వార్డు సచివాలయ పరిధిలోని నిరుద్యోగ వివరాలను మొబైల్ యాప్ ద్వారా సచివాలయ సిబ్బంది స్వీకరించడం జరిగిందన్నారు. డిసెంబర్ రెండో తేదీ నుండి ఆరవ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు మధ్యాహ్నం మూడు గంటల నుండి నాలుగు గంటల వరకు రెండు స్లాట్లలో ఈ పరీక్షలో నిర్వహిస్తామని తెలిపారు. మండలంలోని 11 సచివాలయాల్లో ప్రతిరోజు సచివాలయానికి ఇద్దరు చొప్పున ఐదు రోజులలో 110 మందికి పరీక్ష నిర్వహిస్తా మన్నారు. వింజమూరు రెండు వింజమూరు ఐదు సచివాలయాలలో జరుగుతున్న పరీక్షలను ఎంపిడిఒ పరిశీలించారు. ఈ పరీక్షకు హాజరై తమ ప్రతిభను గుర్తించిన విమట వీరికి వివిధ ప్లాట్ఫార్మర్లలో ఉపాధి కల్పించుటకు కల్పించుటకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని నిరుద్యోగులు పరీక్ష హాజరై ప్రభుత్వానికి, శాసనసభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, అధికారులు, నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

సర్వే చేయమంటే బుకాయిస్తున్నారు..

ప్రజాశక్తి-ముత్తుకూరు

తనకు సంబంధించిన దిబ్బ భూమిని సర్వే చేసి సమగ్రమైన రికార్డు ఇవ్వాలని పలుమార్లు రెవెన్యూ శాఖకు చలానా కట్టినప్పటికీ సంబంధిత అధికారులు బుకాయిస్తున్నారని సిపిఎం, బాధిత రైతు నెల్లూరు వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడారు. రెవెన్యూ శాఖ రికార్డు ప్రకారం ఎల్ పి నెంబర్ 229లో ఉన్నటువంటి విస్తీర్ణం 0.2 సెంట్లు భూమిని సర్వే చేయాలని కోరగా అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆయన అసహనం వ్యక్తం చేశారు. రైతులను మోసం చేసే విధంగా గ్రామ రెవెన్యూ అధికారి అజయ్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తాను సర్వే చేయమంది ఒకటైతే సాగు చేసుకుంటున్న భూమిని సర్వే చేస్తూ మిగిలిన దిబ్బ భూమిని సర్వే చేయకుండా నిర్లక్ష్యంగా ఉంటున్నారన్నారు. దీని వెనుకున్న మతలబు ఏమిటో అర్థం కావడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికే మూడుసార్లు చలానా చెల్లించామని ఇంకెన్ని సార్లు చెల్లించాలి ఎప్పుడు సర్వే చేస్తారో అధికారులు సమాధానం చెప్పాలన్నారు.



గడువులోగా పత్రాలు సమర్పించాలి

ప్రజాశక్తి-ఇందుకూరుపేట: అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్ నియామకానికి సంబంధించి అర్హులైన అభ్యర్థులు అవసరమైన పత్రాలు తప్పనిసరిగా సమర్పించాలని ఇందుకూరుపేట మండల విద్యాశాఖ అధికారి ఎం.వై. సునీల్‌కుమార్ సూచించారు. ఎంఇఒ సునీల్‌కుమార్ మాట్లాడుతూ మండలం పరిధిలోనీ పల్లిపాడు ఉన్నత పాఠశాల ఎస్‌ఎ-ఉర్దూ పోస్టుకు గతంలో దరఖాస్తు చేసిన రాచ్యక్షులు తమ అప్లికేషన్‌తో పాటు క్వాలిఫికేషన్ సర్టిఫికెట్లు, టెట్ మార్క్స్, బ్యాంక్ వివరాలు, నివాస ధృవీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు డిసెంబర్ 3 నుంచి 5 వరకు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల మధ్య ఇందుకూరుపేట మండల విద్యాశాఖ కార్యాలయానికి హాజరై తమ పత్రాలను అందజేయాలని ఆయన తెలిపారు. గడువులోపు పత్రాలు సమర్పించడం అభ్యర్థుల బాధ్యత అని, గడువు అనంతరం పత్రాలు స్వీకరించబడవని స్పష్టం చేశారు.

కోవూరులో 'రైతన్నా మీకోసం'

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు సబ్ డివిజన్ పరిధిలోని కో వూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం, సంగం మండలాల్లో నవంబర్ 24 నుండి 29 వరకు రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహిం చబడు తోందని వ్యవసాయ సహాయ సంచా లకులు జి.అనిత తెలిపారు. ఈ కార్యక్రమం భాగంగా అధికారులు గ్రామాల వారీగా రైతు కుటుంబాలను సందర్శిం చారు.వ్యవసాయ, అనుబంధ శాఖ అధి కారులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సాగు సాంకేతిక సేవలు, పంటల రక్షణ చర్యలు, మార్కెట్ అవకాశాలు వంటి అంశాలపై రైతులకు అవ గాహన కల్పిస్తున్నారు.



వ్యవసాయ సంచాలకులు అనిత

రాష్ట్ర ప్రభు త్వం అమలు చేస్తున్న పంచసూత్రాలు, నీటి భద్రత, డీపీఎంఆర్ పథకం, ఆధునిక సాగు విధానాలు, అగ్రిటెక్ఫుడ్ పాలసీలు, రైతు మద్దతు చర్యలను అధికారులు సమావేశాల్లో వివరించారు.డిసెంబర్ 3న డివిజన్‌లోని ప్రతి రైతుసేవా కేంద్రంలో ప్రత్యేక సమా వేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ, అనుబంధ శాఖ అధికారులు, ప్రతి నిధులు, మహిళా పొదుపు సంఘాల సభ్యులు పాల్గొని రబీ 2025, ఖరీఫ్ 2026, రబీ 2026%-%27 పంటకా లాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయనున్నారు. రైతు ఆదాయం పెరగడం, పంటల రక్షణ, మార్కెట్ పరిజ్ఞానం, అనుబంధ రంగాల అభివృద్ధి వంటి అంశాలపై చర్చించను న్నారు. రైతులు తప్పనిసరిగా హాజరై తమ సూచనలు ఇవ్వాలని అ ది. కా ం ు ల ు పిలుపునిచ్చారు.డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 21,000 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి. సుమారు 6,000 ఎకరాల వరి నారు మడులు ఉన్నాయి. కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా వెంటనే బయటకు పంపివేయాలని సూచించారు. వర్షం తగ్గిన తర్వాత కార్బండైజిమ్ మందును పిచికారీ చేయాలని రైతులకు సూచిం చారు. కొత్తగా నాట్లు వేసిన పొలాల్లో మొక్కలు కుళ్లిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి ఎకరానికీ 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేయడం వల్ల పంట బలపడుతుందని అధికారులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-విడవలూరు

శ్రీ సాయి కళ్యాణ మండపంలో కీర్తిశేషులు మాతూరు శ్రీనివాసులు రెడ్డి సంస్మరణ సభ నిర్వ హించారు. రాష్ట్ర వ్యాప్తంగా నలుమూలల నుండి కళాశాల పూర్వ విద్యార్థులు వర్షాన్ని సైతం లెక్కచేయక విచ్చేసి ఆయనకు మృతికి ఘన నివాళులు అర్పించారు. విద్యార్థి ఉద్యమాలకు ఆయన చేసిన సేవలను, త్యాగాలను, గతాలను గుర్తు చేసుకుని, ఒకరినొకరు ఓదార్చుకున్నారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు "సీనన్న"తో తమకు గల అనుబంధాన్ని గుర్తు తెచ్చు కున్నారు. అన్యాయాలను ఎదుర్కొ వడంలో, నిస్వార్థంగా ప్రజలకు మంచి చేయడంలో, అవినీతికి వ్యతిరేకంగా చేసిన పోరాటాలు, ప్రత్యర్థికి అర్థం కాని విధంగా వ్యూహ రచనలో ఆయనకు ఆయనే సాటి అని కొనియాడారు. తనను నమ్ముకున్నవారిని ఫాలోయర్స్‌గా గాక, నాయకులుగా మలిచిన శక్తీ సామర్థ్యాలు కలిగిన మహానేత గా విడవలూరు మండలం లోనే గాక, జిల్లా స్థాయిలో అందరి అభి మానాన్ని చూరగొన్న యుగపురుషుడు కీర్తించారు. విడవలూరు కళాశాల లో చదువుకొని, వివిధ స్థాయిలలో రాణిం



మాతూరు శ్రీనివాసులరెడ్డ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న స్నేహితులు

చుచున్న పలువురు పూర్వ విద్యార్థులచే జేజేలు అందు కున్నారు. ఆయన ఆశయాలను సాధించు కొనేందుకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. గుంజి వెంకట రాజు, గంగన బోయిన హజరతయ్య సారథ్యంలో, ఆచార్య వెంకటేశ్వర్లు వ్యాఖ్యానాలతో కార్యక్రమం సాగింది. వక్తలు సభను ఉద్దేశించి, శీనయ్య తో తమ అనుభవాలు పంచుకోవడం జరి గింది. మాతూరు శ్రీనివాసులు రెడ్డి కుటు ంబ సభ్యులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనడం, వారికి పూర్వ విద్యార్థు లందరూ బాసటగా ఉంటామని ధైర్యాన్ని ఇచ్చారు. ప.గో. జిల్లా ఏలూరు నుండి, "మానవత" స్వచ్ఛంద సేవ సంస్థ నాయకులు మాతూరు శ్రీనివాసులు రెడ్డి చిరకాల మిత్రుడు అయిన శ్రీ వల్లకవి శ్రీనివాస్ రావు శ్రీనన్న కుటుంబ సభ్యులకు, ఫొటో మానవత పుస్తకాన్ని తన స్నేహానికి గుర్తుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీనన్నతో తనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకుని విచారించారు. కార్యక్రమంలో వల్లకవి శ్రీనివాస్ రావు, మాతూరు శ్రీనివాసులు రెడ్డి కుటుంబ సభ్యులు శ్రీమతి ప్రవీణ, పంది శ్రీనివాసులు, ప్రముఖ న్యాయవాది మడపర్తి రవీంద్ర, సీతాళం సుందర రాజా నాయకులు పొట్టేటి రవీంద్రబాబు, పలువురు ప్రము ఖులు, నాయకులు, గ్రామస్తులు, శ్రయోభి లాషులు పాల్గొని సభను విజయవంతం చేశారు.

పింఛన్ డబ్బులతో ఇంజనీరింగ్ అసిస్టెంట్ పరారీ..

ప్రజాశక్తి-దగదర్తి

ఇంజనీరింగ్ అసిస్టెంట్ జి.శ్రీనివాసులు రూ.3,22,500 పింఛన్ డబ్బులతో పరారైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని పరిధిలోని చెన్నూరు సచివాలయంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ యథావిధిగా బ్యాంకు నుంచి డబ్బులు తెచ్చి చెన్నూరు పంచాయతీకి సంబంధించిన సిద్ధారెడ్డి పాలెంలో సుమారు వితంతువులు వికలాంగులు వృద్ధులు 75మంది పింఛన్లు ఉండగా మొదటి రోజు పింఛన్ ఇస్తారని ఆశతో ఎంతసేపు ఎదురు చూపులు చూశారు. సాయంత్రం అయినా పింఛన్ అందకపోవడంతో గ్రామానికి చెందిన కొంతమంది ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు ఫోన్ చేసిన ఫోన్ స్విచ్ ఆఫ్ అవ్వడంతో ఈ విషయాన్ని ఎంపిడిఒకు తెలపగా దానిపై ఎంపిడిఒ జి.శ్రీని వాసులకు ఫోన్ చేసినా ఎటువంటి స్పందన లేకపోవడంతో సాయంత్రం దాక వెయిట్ చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది సాయంత్రం కూడా స్పందించక పోవడంతో ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించామని వారు తెలిపారు. అన్ని గ్రామాల్లో మిగిలిన పింఛన్ డబ్బులను సిద్ధారెడ్డిపాలెంలో వృద్ధులకు వికలాంగులకు 2వ తేదీ అందజేశారు.



తల్లిదండ్రుల సంరక్షణ చట్టం పకడ్బందీగా అమలు చేయాలి

ప్రజాశక్తి-కావలి: తల్లిదండ్రుల సంరక్షణ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి పేర్కొన్నారు. మంగళవారం ఆర్‌డిఒ కార్యాల యంలో డివిజన్ స్థాయి తుఫాన్ సమీక్ష సమావేశం జరిగిన తర్వాత జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో తల్లిదండ్రులు ఆస్తులను రాయించుకొని తల్లిదండ్రులను బయటకు గెంటి వేస్తున్నారని తెలిపారు. పొలాలు, స్థలాలు రిజిస్ట్రేషన్‌లు చేయించుకొని కుమారులు, కోడళ్ళు తల్లిదండ్రులను బయటకు గెంటి వేస్తున్నారని తెలిపారు. ఇది సామాజిక సమస్య అయిందని తెలిపారు. రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవడం, ఆస్తులను తమ పిల్లల పేర్ల మీద వ్రాయించు కోవడం, తదనంతరం ఇంటి నుండి గెంటి వేస్తున్నారని తెలిపారు. వారు సమాజంలో యాచకులుగా మారుతున్నారని తెలిపారు. అలాంటివారిపై తల్లిదండ్రుల సంరక్షణ చట్టం 2007 ప్రకారం ఎవరైనా నిరాదరణకు గురిచేసిన ఆస్తులు రాయించుకొని బయటకు గెంటి వేసినట్లు నిర్ధారణ అయితే 10 సంవత్సరాల శిక్ష ఉందని తెలిపారు. ఈ చట్టాన్ని అమలు చేయాలని తెలిపారు. వృద్ధులు అయినముక్కు సుబ్బారావు తన కుమారుడు ముక్కు సుకుమార్ ఇళ్ళు రాయించి ఇవ్వలేదని పెట్రోల్ పోసి తగలబెడు తానని బెదిరిస్తున్నారని తెలిపారు. జిల్లాలో అనేకమంది రోడ్ల పాలవుతున్నారని తెలిపారు. ఈ విషయాలపై కలెక్టర్‌కు అర్జీ రూపంలో విజ్ఞప్తి చేయగా తప్పకుండా చట్టాన్ని అమలు చేస్తామని ఆర్‌డిఒకు అప్పీలు చేయాలని, తర్వాత తన వద్దకు తీసుకొని రావాలని చెప్పారని తెలిపారు. ముక్కు సుబ్బారావు, కె.నరసింహారావు, హరిబాబు, తిరుపతి పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న దృశ్యం

ఆదరణ కేంద్రంలో అన్నదానం

ప్రజాశక్తి-బిట్రగుంట భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణకేంద్రంలో కావలి వాస్తవ్యులు సూర సుబ్బమ్మ జ్ఞాపకార్థ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె కుమారులు సూర మోహన్ రెడ్డి మాట్లాడుతూ తన తల్లిగారు పేరు మీద ఆదరణకేంద్రంలో అనాథలకు అన్నదానం చేయడం అదృష్టంగా భావిస్తున్నా నన్నారు. ఆదరణకేంద్రం డైరక్టర్ డాక్టర్ కట్టిపల్లి సింహాద్రి రావు మాట్లాడుతూ సూర మోహన్ రెడ్డి ఆదరణకేంద్రంనకు ఇంతకుముందు కూడా ఎన్నోసార్లు పలురకాలుగా సహాయం అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో సూరా మోహన్ రెడ్డి సోదరుడు సుబ్బారెడ్డి వారి కుటుంబ సభ్యులు పోల్గొన్నారు.

తాత్కాలిక ఉర్దూ ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తు

ప్రజాశక్తి-బిట్రగుంట: 2025-26 సంవత్సరం ఐదు నెలల పాటు తాత్కాలికంగా బోధించడానికి బోగోలు మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బిట్రగుంటలో ఎస్‌ఎ ఉర్దూ పోస్టు ఖాళీగా ఉందని, స్కూల్ అసిస్టెంట్ ఉర్దూ పోస్టుకు తగిన అర్హత గల వ్యక్తుల దరఖాస్తును డిసెంబర్ 5వ తేదీ సాయంత్రం లోపు బయోడేటా సర్టిఫికెట్లతో కప్పరాల తిప్ప గ్రామంలో ఉన్న మండల విద్యాశాఖ కార్యాలయాలో దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి జయమ్మ తెలిపారు.